సాక్షి
జనగామ

బుధవారం । 22 । ఫిబ్రవరి । 2023



అచ్చం ఒకేలా..
కవల పిల్లలు అంటేనే వారికో ప్రత్యేక గుర్తింపు. ఒకే రకమైన రూపురేఖలు.. ఒకే రకమైన దుస్తులు ధరించడం వారి ప్రత్యేకత.
- 8లో▸



గంజాయి స్మగ్లింగ్ ముఠా..
గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను టాస్క్‌ఫోర్స్, ఆత్మకూరు పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసినట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ కరుణాకర్ తెలిపారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
36^0 /19^0

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రిపూట సమయంలో చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

- అగ్నిగుండాలు, పూర్ణాహుతితో ముగింపు



పాలకుర్తి టౌన్: ప్రముఖ శైవక్షేత్రం పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలు మంగళవారం అగ్నిగుండాలు, పూర్ణాహుతితో మంగళవారం ముగిశాయి. చివరి రోజు ఆలయంలోని మెట్ల ఎదురుగా ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో తెల్లవారుజామున 4:30 గంటలకు స్వామివార్లను పల్లకిలో తిప్పుతూ వాహనకారులు భక్తి పారవశ్యంతో నడిచారు. అలాగే భక్తులు నిప్పులపై శివనామస్మరణ చేస్తూ అగ్నిగుండంలో నుంచి నడిచి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయంలో నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దంపతులు వెనుకదాసుల రామచంద్రయ్యశర్మ, ఈఓ నండూరి రజనీకుమారి ఆలయ అర్చకులు దేవగిరి రామన్న, లక్ష్మన్న, డీవీఆర్‌శర్మ, అనిల్‌కుమార్, నాగరాజు, ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, ధర్మకర్తలు, సిబ్బంది, వాహనకారులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ల విడుదల



చిల్పూరు: ఈ నెల 26 నుంచి మార్చి 5వ తేదీ వరకు నిర్వహించనున్న మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను మంగళవారం హన్మకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజయ్యలు ఆవిష్కరించారు. ఉదయం ఆలయ అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు వేదమంత్రాల నడుమ ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈవో వెంకట్రావు ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మిశెట్టి సరితబాలరాజు, మార్కెట్ చైర్మన్ గుజ్జరి రాజు, ధర్మకర్తలు జంగిటి కుమార్, కుంచాల సంపత్‌రాజు, రవీందర్ రెడ్డి, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, తీగల మహేందర్, జీడి ఆనందం, బొట్టు చేరాలు, పిట్టల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

డీటీసీపీఓగా వీరస్వామి



జనగామ: జిల్లా టౌన్ కంట్రీ ప్లానింగ్ ఆఫీసర్‌గా రంగు వీరస్వామి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన శ్రీధర్‌రెడి ఇటీవల బదిలీ కాగా ఆయన స్థానంలో వీరస్వామి వచ్చారు. ప్రస్తుతం టౌన్ ప్లానింగ్ అధికారిగా ఉన్న ఆయనకు అదనంగా డీటీసీపీఓగా బాధ్యతలను అప్పగించారు.

నేడు జీవిత రాజశేఖర్ రాక

జనగామ రూరల్/దేవరుప్పుల: బీజేపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్నర్ మీటింగ్‌కు బీజేపీ నాయకులు జీవిత రాజశేఖర్ నేడు జనగామ నియోజకవర్గంలో నిర్వహించే కార్యక్రమానికి హాజరు కానున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బల్లా శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనగామలోని సుభాష్ విగ్రహం వద్ద, అలాగే పడమటి కేశవాపూర్‌లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారని కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అదే విధంగా దేవరుప్పుల మండల పరిధిలోని పెద్దమడూరులో నిర్వహించే కార్నర్ మీటింగ్‌కు సైతం జీవిత రాజశేఖర్ రానున్నట్లు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్ తెలిపారు.

భూదాన్ భూములను పరిరక్షించాలి

రఘునాథపల్లి: ఆక్రమణకు గురవుతున్న భూదాన్ భూములను ప్రభుత్వం పరిరక్షించాలని రాష్ట్ర భూ పరిరక్షణ సమితి అధ్యక్షుడు బుగ్గ మైసయ్య డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మేకలగట్టులో 206 సర్వే నంబర్‌లో ఆక్రమణకు గురైన భూదాన్ భూముల వద్ద ఈ నెల 24న హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే అసైన్డ్ భూ బాధితుల సదస్సు వాల్‌పోస్టర్లను సంఘం నాయకులతో కలిసి ఆయన మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించిన భూదాన్ భూములను రియల్టర్లు ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ భూ రక్షణ సమితి ద్వారా భూదాన్ భూములు దక్కించుకునే వరకూ పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి రాష్ట్ర సలహాదారులు మేకల నరేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవిగౌడ్ పాల్గొన్నారు.

ఏడుగురే హాజరు..



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జమున



బడ్జెట్ సమావేశానికి మెజార్టీ సభ్యుల గైర్హాజరుతో వెలవెలబోతున్న కౌన్సిల్

- కోరం లేక వాయిదా పడిన మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం
- చైర్‌పర్సన్, ఆరుగురు కౌన్సిలర్లు మాత్రమే రాక
- 23మంది అధికార పార్టీ, కాంగ్రెస్, బీజేపీ సభ్యుల గైర్హాజర్
- నేడు మరో సారి బడ్జెట్ సమావేశం

జనగామ: మున్సిపాలిటీ పాలకమండలి బడ్జెట్ సమావేశానికి మంగళవారం ఏడుగురే హాజరయ్యారు. దీంతో కోరం లేకపోవడంతో వాయిదా పడింది. అధికార పార్టీకి చెందిన అసమ్మతి సభ్యులతో పాటు ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు సమావేశానికి దూరంగా ఉన్నారు. చైర్‌పర్సన్ జమున, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్‌లపై అవిశ్వాసం గురించి బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు చెందిన సభ్యులు అదనపు కలెక్టర్‌కు లెటర్ ఇచ్చారు. ఇదే క్రమంలో బడ్జెట్ సమావేశాలకు బీజేపీ కౌన్సిలర్లు సైతం దూరంగా ఉండడంతో పరోక్షంగా మద్దతు ఇచ్చినట్లు అయింది. దీంతో బడ్జెట్ సమావేశం నేటి(బుధవారం)కి వాయిదా పడింది.

కోరం లేక వాయిదా..

జనగామ మున్సిపాలిటీ బడ్జెట్ 2023–24 సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా పడింది. మున్సిపాలిటీ 30 వార్డులు ఉన్నాయి. ఇందులో బీఆర్‌ఎస్‌కు 18 మంది సభ్యుల(ఇందులో స్వతంత్ర, కాంగ్రెస్ నుంచి చేరిన) బలం ఉండగా, కాంగ్రెస్‌కు 8, బీజేపీకి నలుగురు కౌన్సిలర్లు ఉన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌కు సంబంధించి రూ.20.79కోట్లకు కౌన్సిల్ ఆమోదం తీసుకోవాల్సి ఉంది. మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య అధ్యక్షతన బడ్జెట్ సమావేశం మంగళవారం ఏర్పాటు చేశారు. ఉదయం 11.30 గంటలకు సమావేశం మొదలు కాగా చైర్‌పర్సన్‌తో పాటు బీఆర్‌ఎస్‌కు చెందిన తాళ్ల సురేష్ రెడ్డి(8వ వార్డు), మేకల రాంప్రసాద్ (వైస్ చైర్మన్ 23వ వార్డు), బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ మారబోయిన పాండు(15), పగిడిపాటి సుధా (3), గుర్రం భూలక్ష్మి (12), ఎండి సమ్మద్ (28), కో–ఆప్షన్ సభ్యులు మసీఉర్ రెహమాన్, పానుగంటి రోహిణి, ఉల్లెంగుల నవ్య శ్రీ హాజరయ్యారు. 11 మంది అధికార అసమ్మతి సభ్యులు, 8 మంది కాంగ్రెస్, 4 బీజేపీ కౌన్సిలర్లు బడ్జెట్ సమావేశాలకు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 12.30 గంటల వరకు కౌన్సిలర్ల కోసం ఎదురు చూసిన అధికారులు 60శాతం కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రజిత, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, మేనేజర్ రాములు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లిగారి మధు, ఏఈ మహిపాల్, అకౌంటెంట్ ఆఫీసర్ సంతోషి తదితరులు ఉన్నారు.

నేటికి వాయిదా..

కోరం లేక వాయిదా పడ్డ మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం నేడు(బుధవారం) నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ జమున విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సీడీఎంఏ నిబంధనలను అనుసరించి.. 24 గంటల తర్వాత సమావేశం నిర్వహించుకోవచ్చని తెలిపారు. నేడు ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశానికి కౌన్సిలర్లు హాజరు కావాలని కోరారు.

70ఏళ్ల పురపాలిక చరిత్రలో మచ్చ

ఏడు దశాబ్దాల(70ఏళ్లు) క్రితం నగర పంచాయతీ నుంచి జనగామ మున్సిపాలిటీ ఆవిర్భవించింది. నాటి నుంచి జరిగిన బడ్జెట్ సమావేశాలు పురపాలిక ఆమోదం తీసుకున్నాయి. మొదటి సారిగా కోరం లేక బడ్జెట్ సమావేశం వాయిదా పడడం చరిత్రలో మున్సిపాలిటీకి ఓ మచ్చగా మిగిలిపోనుంది. రెండోసారి కూడా మెజార్టీ సభ్యులు గైర్హాజరైతే కలెక్టర్ ఆమోదించాల్సి ఉంటుందని తెలుస్తోంది.

23 మంది సభ్యుల గైర్హాజరు

అసమ్మతి గ్రూపునకు బీజేపీ సభ్యుల గైర్హాజర్ సైతం బలం చేకూర్చింది. మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ అధికార పార్టీకి చెందిన 11, కాంగ్రెస్‌కు చెందిన 8 మంది అవిశ్వాసం కోరారు. ఈ సమయంలో బీజేపీకి చెందిన 4 సభ్యులు తటస్థంగా ఉన్నారు. అవిశ్వాస సమయంలో 21 మంది బలం అవసరం ఉంటుంది. ఈ బడ్జెట్ సమావేశానికి బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌తో పాటు బీజేపీ కౌన్సిలర్లు కూడా డుమ్మా కొట్టడంతో ఆ వర్గానికి కొంత బలం పెరిగింది. 75శాతానికి పైగా సభ్యులు అసమ్మతిపై ఒకే మాటపై ఉంటే..అవిశ్వాసానికి లైన్ క్లియర్ కానుంది.

'ఒట్టు' తప్పని సభ్యులు.. అవిశ్వాసం వైపే అడుగులు

చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం కోరే సమయంలో 11మంది బీఆర్‌ఎస్ సభ్యులు భువనగిరి రేణుకాఎల్లమ్మ దేవాలయంలో ఒట్టు వేసుకున్న సంగతి తెలిసిందే. సుమారు 27 రోజులుగా కౌన్సిలర్లు ఒకేమాట.. ఒకేబాట అన్నట్టు ముందుకు వెళ్తున్నారు. ఎక్కడా కూడా విబేధాలు రానివ్వకుండా.. మాట మీద నిలబడుతున్నారు. దీంతో పాటు ప్రతిపక్ష పార్టీలకు చెందిన కాంగ్రెస్‌ను తమవైపు తిప్పుకోగా పరోక్షంగా బీజేపీ సైతం మద్దతు ఇచ్చేలా చక్రం తిప్పారు. బడ్జెట్ సమావేశాలకు బీజేపీ, కాంగ్రెస్, అధికార అసమ్మతిలోని కొందరు బడ్జెట్ సమావేశానికి హాజరవుతారని చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ బలంగా నమ్మారు. నమ్మకం పెట్టుకున్న బీజేపీతో పాటు అసమ్మతి గ్రూపులో ఉన్న ఎవరూ రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు.

అవినీతి పరులకు గైర్హాజరే హెచ్చరిక

పాలక మండలిలో అవినీతిపరులు 23 మంది కౌన్సిలర్ల గైర్హాజరే హెచ్చరికగా భావించాలని అసమ్మతి సభ్యులు అంటున్నారు. మంగళవారం పట్టణంలో సమావేశమైన బీఆర్‌ఎస్ అసమ్మతి, ప్రతిపక్ష కాంగ్రెస్, తదితరులు సభ్యులు బడ్జెట్ సమావేశాల గైర్హాజరు, అవిశ్వాసంపై చర్చించుకున్న తర్వాత విలేకర్లతో ఫోన్‌లో మాట్లాడారు. చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ పాలనను 75శాతం మంది సభ్యులు తిరస్కరించారని తెలిపారు. రెండోసారి బడ్జెట్ సమావేశానికి సైతం హాజరుకామని తెలిపారు. పురపాలిక పాలన కొందరికే పరిమితం అయిందని మండిపడ్డారు. కౌన్సిలర్లతో సంబంధం లేకుండా బడ్జెట్ ఆమోదించుకుంటారేమో కానీ.. తమ అవిశ్వాన్ని అడ్డుకోలేరన్నారు. గత బడ్జెట్‌ను ఎంత మేరకు అమలు చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. ఏటా అంకెలను మారుస్తూ.. బడ్జెట్ ఆమోదం పేరిట తూతూ మంత్రంగా సమావేశాలు నిర్వహించడం తప్ప, ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన తమకు పురపాలికలో ఏమాత్రం గౌరవం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్ల పాటు ఆడిట్ లేకపోడంతో ఖర్చు చేసిన పైసలకు లెక్కా పత్రం కనిపించడం లేదని తెలిపారు. 30 మంది కౌన్సిలర్లకు.. 23 మంది ఒక వైపు.. ఏడుగురు మాత్రమే మరో దిక్కు ఉన్నారని తెలిపారు.

ప్రాక్టికల్స్‌కు 74మంది గైర్హాజర్



విద్యార్థులను పరిశీలిస్తున్న అధికారి

జనగామ రూరల్: జిల్లా వ్యాప్తంగా 10 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు 74 మంది విద్యార్థులు గైర్హాజర్ అయ్యారని పరీక్షల కన్వీనర్ బైరి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. మొత్తం 755 మంది విద్యార్థులకు గాను 681 మంది పరీక్షలకు హాజరయ్యారని వివరించారు. ఈ సందర్భంగా పలు పరీక్ష కేంద్రాలను కన్వీనర్ బైరి శ్రీనివాస్, సభ్యులు లలిత, ఆంజనేయరాజు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు నర్మెట్ట, దేవరుప్పుల, పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్, జఫర్‌గఢ్ కళాశాలలను సందర్శించారు.

108 అంబులెన్స్‌లో ఉద్యోగాల భర్తీ పూర్తి

జనగామ రూరల్: 108 అంబులెన్స్‌లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి అయిందని ప్రోగ్రాం మేనేజర్ నసీరుద్దీన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని వెటర్నరీ ఆస్పత్రి మీటింగ్ హాల్‌లో అభ్యర్థులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టులకు 23 మంది అభ్యర్థులు హాజరు కాగా పైలెట్ పోస్టులకు 40 మంది హాజరు అయ్యారని తెలిపారు. ఇందులో పైలెట్ పోస్టులకు 17 మందిని, ఈఎంటీ పోస్టులకు 12 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు వెంకటరమణ, ఈఎంసీఎల్ వెంకటేశం, పైలెట్ కో ఆర్డినేటర్ మహబూబ్, ఈఎంఈలు శ్రీనివాస్, రహీంలు తదితరులు పాల్గొన్నారు.

కేయూను సందర్శించిన బ్రిటీష్ వర్సిటీ ప్రతినిధులు

విదర్భ రాష్ట్రం కోసం ర్యాలీ

జాతీయస్థాయిలో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

- 10లో▸

పనులు త్వరగా పూర్తిచేయాలి

- కలెక్టర్ శివలింగయ్య



మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ రూరల్: మన ఊరు– మన బడి పథకం కింద చేస్తున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ శివలింగయ్య అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మోడల్ పాఠశాలల అభివృద్ధి పనులు, కాంపౌండ్ వాల్స్, మరుగుదొడ్లు, కలరింగ్, డైనింగ్ హాల్, గార్డెనింగ్, విద్యుత్, బ్లాక్ బోర్డు వంటి 12 రకాల పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే జిల్లాలో మూడు పాఠశాలలు ప్రారంభం కాగా 23 పాఠశాలల్లో వారం రోజుల్లో పనులు పూర్తి అవుతాయని తెలిపారు. 49 పాఠశాలల్లో సివిల్ పనులు 10 రోజుల్లో పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఆయిల్ పామ్ ప్లాంటేషన్‌పై అదనపు కలెక్టర్ ఉద్యానవన ఆధికారులతో మాట్లాడారు. జిల్లాకు ఇచ్చిన లక్ష్యం 4వేల ఎకరాలని తెలిపారు. ఇప్పటికే 2,524 ప్లాంటేషన్ పూర్తి కాగా 730 ఎకరాల్లో వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డీఈఓ రాము, ఉద్యానవన అధికారి కేఆర్ లత, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి లివర్ వ్యాధి.. కొడుకుకు బోన్ క్యాన్సర్

- బాధితులను పరీక్షించిన జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ సుగుణాకర్‌రాజ్
- బాధితులను పాలియాటివ్ కేర్ సెంటర్‌కు తరలింపు



బాధితులను పరీక్షిస్తున్న డాక్టర్ సుగుణాకర్‌రాజు తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండల పరిధిలోని తానేదార్‌పల్లిలో ఓ నిరుపేద కుటుంబంలో తండ్రికి లివర్ సంబంధిత వ్యాధి, కొడుకు బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న జనగామ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారి డాక్టర్ సుగుణాకర్‌రాజు మంగళవారం గ్రామానికి వెళ్లి బాధితులను స్వయంగా పరీక్షించి వివరాలు వెల్లడించారు. తండ్రి మాచర్ల రాజు సిరోసిస్ ఆఫ్ ద లివర్, జాండీస్, కొడుకు ఎడమ భుజం బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారని తెలిపారు. ఇద్దరి పరిస్థితి విషమంగానే ఉందని, వారిని మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని పాలియాటివ్ కేర్ సెంటర్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. అక్కడ వారికి మెరుగైన చికిత్సతో పాటు భోజన సౌకర్యం అందిస్తామన్నారు. తానేదార్‌పల్లి గ్రామంలో క్యాన్సర్ కేసులు ఎక్కువగా ఉన్నాయని, ఈ విషయమై గ్రామంలో త్వరలో ప్రత్యేకంగా క్యాంపు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాజు ఆరోగ్య పరిస్థితి బాగా లేదని తెలుసుకున్న గ్రామానికి చెందిన రైస్ మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధీర్, టీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్, వైద్యులు అశోక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో పోస్టాఫీస్ ఖాతాలు

దేవరుప్పుల: ఆన్‌లైన్‌లో పోస్టాఫీస్ ఖాతాలు తెరుచుకునే అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జనగామ సబ్ డివిజన్ బీపీఓ పి.అశోక్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని పోస్టాఫీసును ఆయన మంగళవారం సందర్శించి వినియోగదారుల సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల ప్రభుత్వ రంగ స్కీములతో ఇప్పటి వరకు ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్న తపాలా శాఖ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు నడుం బిగించిందన్నారు. ఖాతా తీసుకునే వారు పోస్టు ఇన్ఫో అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకొని దాని ద్వారా వారి చిరునామా ఇతర వివరాలు నమోదు చేసుకొని సర్వీస్ రిక్వెస్ట్ రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. సర్వీస్ రిక్వెస్ట్ వచ్చిన వెంటనే పోస్టల్ సిబ్బంది ఇంటికి వచ్చి వివరాలు సేకరిస్తారని తెలిపారు. మరింత సమాచారానికి టోల్ ఫ్రీ నంబర్ 18002666868లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోస్టు మాస్టర్ రవికుమార్, సిబ్బంది ఖలీల్‌పాషా, ఉప్పలయ్య పాల్గొన్నారు.

తూర్పులో జోడో జోష్

- రెట్టించిన ఉత్సాహంతో ముందుకు
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ 'తూర్పు'లో సాగిన యాత్ర
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి విసుర్లు
- అవకాశం ఇస్తే పాలకుర్తిలోనూ పోటీ చేస్తామని 'కొండా' ప్రకటన



మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి



రేవంత్‌రెడ్డికి గజమాల వేస్తున్న నాయకులు

సాక్షి, వరంగల్/వరంగల్/రామన్నపేట: హాథ్ సే హాథ్ జోడో యాత్ర వరంగల్ తూర్పు నియోజకవర్గంలో జోష్ నింపింది. నాయకులు, కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో రేవంత్‌రెడ్డితో కలిసి ముందుకు సాగారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ.. స్థానిక నేతల పాలన తీరును విమర్శిస్తూ.. చురకలు అంటిస్తూ చేసిన ప్రసంగం కార్యకర్తలను ఉత్సాహపరిచేలా చేసింది. మంగళవారం సాయంత్రం 6.28 గంటలకు ఎంజీఎం చౌరస్తాకు చేరుకున్న రేవంత్‌రెడ్డి.. రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నాయకులతో కలిసి పాదయాత్రను ప్రారంభించారు. అక్కడినుంచి గోపాలస్వామిగుడి జంక్షన్‌కు చేరుకోగా.. చేనేత కార్మిక సంఘం నాయకుడు చిప్ప వెంకటేశ్వర్లు సమస్యలపై వినతిపత్రం అందించి కండువా కప్పి సన్మానించారు. 6.56 గంటలకు పోచమ్మమైదాన్ సెంటర్‌కు, 7.02 గంటలకు మండిబజార్ దర్గా వద్దకు చేరుకుని ప్రార్థనలు చేశారు. 7.23 గంటలకు వరంగల్ చౌరస్తాకు చేరుకున్న ఆయన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గుర్రపు బగ్గీని ఎక్కారు. ఆయన వెంట కొండా దంపతులు ఉండగా.. కార్యకర్తలకు అభివాదం చేస్తూ వరంగల్ పోస్టాఫీస్ జంక్షన్‌కు చేరుకున్నారు. రేవంత్‌రెడ్డి, కొండా మురళిని కాంగ్రెస్ నాయకులు భారీ గజమాలతో సన్మానించారు. అనంతరం జరిగిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

అభివృద్ధి అంతా మేం చేసిందే..

వరంగల్ నగరంలో జరిగిన అభివృద్ధి అంతా కాంగ్రెస్ హయాంలో జరిగిందేనని సభ సాక్షిగా చెప్పుకొచ్చారు. ఎంజీఎం, నిట్, కాకతీయ యూనివర్సిటీ కాంగ్రెస్ హయాంలోనే నెలకొల్పినట్లు గుర్తు చేశారు. 'తండ్రీకొడుకు కేసీఆర్, కేటీఆర్‌లకు ఇక్కడ ఉండే భూములు, ఆస్తులపై ప్రేమ ఉంది. కానీ.. అభివృద్ధిపై లేదని, అందుకే ఆలోచన చేయండి.. మార్పు రావాలి' అని సభకు హాజరైన ప్రజలను కోరారు. మరోమారు ఇద్దరు ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, నరేందర్‌లపై బిల్లా రంగాలు అంటూ విరుచుకుపడ్డారు. భూమి, కాలువ, శిఖం, చెరువు, చివరకు పేదలు, బలహీనులు ఉండే ప్లాట్లు కబ్జా చేసుడే పనిగా పెట్టుకున్నట్లు ఆరోపించారు. వైఎస్ హయాంలో ఎంత గుర్తింపు ఉందో.. రాబోయే ప్రభుత్వంలోనూ కొండా దంపతులకు అదే గుర్తింపు ఉంటుందని, ఇక్కడ సురేఖ గెలుపుతో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం ఖాయమని దీమా వ్యక్తం చేశారు.

అరూరి సొంతూళ్లో 24 బెల్ట్ షాపులంట...

'వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ సొంతూరు ఉప్పుగల్ గ్రామ పంచాయతీలో 12 వార్డులుంటే.. బెల్ట్‌షాపులు 24 ఉన్నాయని అక్కడి మహిళలు అన్నారు. వారు తాగొచ్చి పెట్టే కష్టాలతో జీవితాలు ఆగం అవుతున్నాయన్నారు. అందుకే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బెల్ట్ షాపులు ఉండకుండా చూస్తా'మని రేవంత్ అన్నారు.

పాలకుర్తిలోనూ అవకాశమిస్తే కొండా పోటీ..

'వరంగల్‌లో రేవంత్ సభ అనగానే మంత్రి దయాకర్‌రావుకు నిద్ర పట్టడం లేదు. పాలకుర్తిలో మీరన్నా పోటీ చేయాలి. లేదా మేమైనా పోటీ చేస్తాం. మీ లేదా మా చేతిలో దయాకర్‌రావు ఓడిపోవాలి అని చెబుతున్నాం' అని రేవంత్‌రెడ్డితో మాజీ మంత్రి కొండా సురేఖ అన్నారు. 'నేను ఒక్క తల్లి, తండ్రికి పుడితే టీడీపీని వీడను అని దయాకర్‌రావు.. అన్నడు. బీఆర్‌ఎస్‌లో ఎప్పుడు చేరాడో అప్పుడే సచ్చిపోయిండు. చంపిన పామును చంపాల్సిన అవసరం మాకు లేదు. ఇక వరంగల్ ఈస్ట్ విషయానికొస్తే.. మా హయాంలోనే కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశాం' అని సురేఖ చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో వరంగల్ ఇన్‌చార్జ్ అంజనీకుమార్ యాదవ్, ములుగు ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, సిరిసిల్ల రాజయ్య, దొమ్మాటి సాంబయ్య, వేం నరేందర్‌రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, కొండా సుస్మితా పటేల్, నమిండ్ల శ్రీనివాస్, ఎర్రబెల్లి స్వర్ణ, రవళిరెడ్డి, బట్టి శ్రీనివాస్, సుధాకర్ గౌడ్, అయూబ్‌ఖాన్, మీసాల ప్రకాశ్, కూరతోట సదానందం, మడిపెల్లి కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

25న జాబ్‌మేళా

జనగామ రూరల్: ఈ నెల 25న జిల్లాలో సాకేత్ హెచ్‌ఆర్ సర్వీస్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రైవేట్ జాబ్ మేళాను ఆసక్తి గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి ఉమారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, టెన్త్, ఇంటర్ ,డిగ్రీ ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 25న శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గల ఉపాధి కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని, సంబంధిత ధృవపత్రాలతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 7995430401 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్రమశిక్షణతో చదవాలి

- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



మెటీరియల్ అందజేస్తున్న అదనపు కలెక్టర్, డీఈఓ

జనగామ రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. మండల పరిధిలోని శామీర్‌పేటలో గల మైనార్టీ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమయాన్ని వృథా చేయకుండా వచ్చే పబ్లిక్ పరీక్షలో మంచి మార్కులు సాధించాలన్నారు. పక్కా ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. పాఠ్యాంశాల్లో సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. గురుకులంలో అన్ని రకాల వసతులు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకుని వచ్చే పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించాలని కోరారు. గతంలో 95శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కె.రాము, మైనార్టీ సంక్షేమ అధికారి ఇస్మాయిల్, ప్రిన్సిపల్ స్టాన్లీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వివాహేతర సంబంధం బట్టబయలు


నాగేందర్‌ను పోలీసులకు అప్పగించేందుకు తీసుకెళ్తున్న దృశ్యం

- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న భర్త
- కట్టేసి పోలీసులకు అప్పగింత

మంగపేట: ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య వివాహేతర సంబంధాన్ని భర్త బట్టబయలు చేశాడు. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. ఈ ఘటన మంగపేట మండలంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఉపాధ్యాయురాలి భర్త, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు.. మరో ఉపాధ్యాయురాలితో కొంతకాలంగా వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఉపాధ్యాయురాలి భర్త మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. దీంతో కూతురితో అద్దె ఇంట్లో ఉంటున్న ఉపాధ్యాయురాలు, అప్పటికే ఇద్దరు భార్యలను వదిలేసి ఒంటరిగా ఉంటున్న ఉపాధ్యాయుడు నాగేందర్‌కు దగ్గరైంది. సెలవు రోజుల్లో వచ్చి వెళ్తే భర్తను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడంతో అనుమానం వచ్చి కూతురు ద్వారా ఆరా తీయగా అసలు విషయం తెలుసుకున్నాడు. ఈ విషయంపై రెండు నెలల క్రితం పాఠశాల హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశాడు. తన భార్యకు దూరంగా ఉండాలని నాగేందర్‌ను తీవ్రస్థాయిలో హెచ్చరించాడు. స్పందించిన అధికారులు ఉపాధ్యాయురాలిని మరో పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించారు. అయినప్పటికి నాగేందర్, ఉపాధ్యాయురాలితో వి వాహేతర సంబంధం కొనసాగిస్తూనే ఉన్నాడు. ఈ క్రమంలోనే ఉపాధ్యాయురాలు భర్త కానిస్టేబుల్ ఈ నెల 18న శివరాత్రి బందోబస్తు డ్యూటీపై వేములవాడకు వెళ్లాడు. సోమవారం సెలవు ఉండటంతో మంగపేటలో ఉంటున్న భార్య, కూతురును చూసేందుకు వచ్చాడు. అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో నాగేందర్.. ఉపాధ్యాయురాలి సెల్‌కు ఫోన్‌చేయగా భర్త లిఫ్ట్ చేశాడు. 'నేను వస్తున్నా తలుపు తీసి ఉంచు'అని నాగేందర్ చెప్పాడు. తన అనుమానం నిజమైందని భావించిన భర్త తలుపు తీసి బాత్‌రూంలో దాక్కున్నాడు. నాగేందర్ ఇంట్లోకి రాగానే గడియ పెట్టి ఇంతరాత్రి ఇంటికి ఎందుకు వచ్చావు అని అడుగుతున్న క్రమంలో పడుకుని ఉన్న తన భార్య, నాగేందర్ ఇద్దరు కలిసి అతనిపైనే దాడి చేసేందుకు యత్నించారు. దీంతో భయపడిన అతను ఇంటి గడియపెట్టి బయటకు వచ్చి ఇరుగుపొరుగుకు చెప్పాడు. ఉదయం తాళ్లతో ఇద్దరిని బంధించి పోలీసులకు అప్పగించారు.

పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర దొంగ?

జనగామ: జనగామ పట్టణం వాసవీనగర్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీకి పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగను జనగామ పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. చోరీ జరిగిన ఆరు గంటల్లోనే కేసును చేధించారు. రాష్ట్రంతో పాటు పలు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. వాసవీనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో పట్టపగలే చోరీకి పాల్పడి 9 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.40వేల నగదు ఎత్తుకెళ్లిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న ఏసీపీ దేవేందర్ రెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్ రంగంలోకి దిగి, సీసీ ఫుటేజీల సాయంతో దొంగను పట్టుకున్నట్లు తెలిసింది. సదరు నిందితుడిపై మూడు రాష్ట్రాల్లో కేసులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం.

అచ్చం ఒకేలా..

- అబ్బుర పరుస్తున్న ట్విన్స్
- నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం

కవల పిల్లలు అంటేనే వారికో ప్రత్యేక గుర్తింపు. ప్రతిఒక్కరు ఆసక్తిగా గమనిస్తారు. ఒకే రకమైన రూపురేఖలు.. ఒకే రకమైన దుస్తులు ధరించడం వారి ప్రత్యేకత. చాలా మంది కవలలు కనీసం గుర్తు పట్టలేని విధంగా అచ్చం ఒకేలా ఉంటారు. నేడు (బుధవారం) అంతర్జాతీయ కవలల దినోత్సవం సందర్భంగా వారి తల్లిదండ్రుల మనోభావాలు మీకోసం..

–నర్సంపేట/దుగ్గొండి


సందేష్‌గౌతమ్- సందేష్‌వివేక్

దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన ప్రముఖ న్యాయవాది కుసుమ జగదీష్–శిరీష దంపతుల కుమారులు సందేష్‌గౌతమ్- సందేష్‌వివేక్ కవలలు. ప్రతియేట వీరిద్దరి పుట్టిన రోజుతో పాటు కవలల దినోత్సవం రోజు కూడా వీరికి తల్లిదండ్రులు పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్నారు.


హిమ ప్రియ- కీర్తిప్రియ

దుగ్గొండి మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన పల్లె శ్రీనివాస్–వందన దంపతులకు కవల పిల్లలు హిమ ప్రియ– కీర్తిప్రియ ఉన్నారు. 4వ తరగతి చదువుతున్నారు. వీరిని కుటుంబ సభ్యులు మినహా ఎవరూ గుర్తుపట్టరు.

దేవుడి వరంలా భావిస్తాం..


తల్లిదండ్రులు విజయ్‌కుమార్‌ప్రమీలతో కార్తీజాన్వి, కృతిజాన్వి

మాకు మొదటి సంతానంలో కవల కూతుళ్లు జన్మించడం దేవుడిచ్చిన వరంలా భావిస్తాం. ఇద్దరికి ఒకే రకమైన వస్త్రాలు కొనుగోలు చేసి ఆనందాన్ని పంచుకుంటాం. ఇద్దరు కూతుళ్లు కూడా ఒకరిని విడిచి మరొకరు ఉండరు. బంధువులు ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ప్రేమను పంచడంతో మురిసిపోతాం.

–అజ్మీర విజయ్‌కుమార్‌ప్రమీళ, బోజ్యానాయక్‌తండా

అభిరుచులు ఒకటే..



మొదటి సంతానంలో కుమారుడు జన్మించగా రెండో సంతానంలో ఒకే పోలికతో జన్మించిన దీపిక, దీక్షికరెడ్డిల అభిరుచులు ఒకే విధంగా ఉంటాయి. ఆటపాటలతో పాటు చదువుల్లో కూడా ప్రతిభ కనబరుస్తారు. బంధువుల ఇళ్లకు వెళ్లినప్పుడు ఇద్దరు కలిసి వెళ్తారు. కొత్త వారు చూసినప్పుడు ఎవరి పేరు ఏమిటో గుర్తు పట్టలేని విధంగా ఉండడం సంతోషాన్ని కలిగిస్తుంది.

–తల్లిదండ్రులు నరేశ్‌రెడ్డి,లావణ్యతో దీపిక, దీక్షికరెడ్డి

ఐక్యంగా ఉంటారు..





మాకు మొదటి సంతానంలో కవల లు జన్మించారు. వీరికి ఫుర్ఖాన్, అఫాన్‌లుగా పేర్లు పెట్టాం. ఇద్దరు ఐక్యంగా ఉండడంతో పాటు ఒకరిని విడిచి ఒకరు ఉండలేరు. కవల పిల్లలు జన్మించడం, వారి పోలికలు కూడా ఒకేలా ఉండడం ఆనందాన్ని కలిగిస్తుంది.

–తల్లిదండ్రులు ఫయాజుద్దీన్,ఆరిఫాబేగంతో ఫుర్ఖాన్, అఫాన్

ఉచ్చుకు బలైంది చిరుతపులే!

- నిందితుడు తీసిన ఫొటోల ఆధారంగా గుర్తింపు
- సీసీఎంబీ నుంచి రిపోర్ట్ వచ్చాకే అధికారిక వెల్లడి


ఉచ్చుకు బలైన అనంతరం నిందితుడు తీసిన చిరుతపులి ఫొటో

భూపాలపల్లి: భూపాలపల్లి అడవుల్లో ఉచ్చుకు బలైంది చిరుత పులి అని అటవీశాఖ అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే.. పదిహేను రోజుల క్రితం భూపాలపల్లి రేంజ్ పరిధిలోని రాంపూర్ సెక్షన్‌లో రాజీవ్‌నగర్ నుంచి పంబాపూర్ వెళ్లే దారిలో వేటగాళ్లు అమర్చిన ఉచ్చుకు పులి బలి అయినట్లు పుకార్లు షికార్లు చేశాయి. చనిపోయిన పులిని వేటగాళ్లు ఖననం చేసినట్లు చర్చ జరిగింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఖననం చేసిన స్థలం కోసం రెండు రోజుల పాటు తీవ్రంగా గాలించినప్పటికి ఫలితం లేకపోయింది. దీంతో అనుమానితులైన ఇద్దరిని ఈ నెల 15న రాత్రి అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ విచారణలో వేటకు బలైన అటవీ జంతువు ఏదనేది వారు పూర్తిగా సమాచారం ఇవ్వలేదు. దహనం చేసిన స్థలాన్ని చూపించగా అధికారులు అక్కడ ఉన్న ఎముకలు, పూర్తిగా కాలని కాలు, పుర్రెను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ మేరకు 16వ తేదీన నిందితులను కోర్టులో హాజరు పరిచారు. అయితే చనిపోయింది పులి అని ప్రచారం జరిగినప్పటికీ, అది చిరుతపులి అని అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. నిందితుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లో చనిపోయిన చిరుత పులి ఫొటోను గుర్తించి అదే కోర్టులో అందజేసినట్లు సమాచారం. పశు వైద్యశాఖ అధికారులు పూర్తి స్థాయిలో నిర్ధారణకు రాని కారణంగా సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయోలజీ (సీసీఎంబీ) రిపోర్టు కోసం వేచి చూస్తున్నట్లు తెలిసింది. నిందితుడి సెల్‌ఫోన్‌లో లభించిన ఫొటోతో పాటు ఉచ్చులు అమర్చిన స్థలంలో పాదముద్రలు (పగ్ మార్క్స్) ఆధారంగా అది పక్కా చిరుత పులేనని భావిస్తున్నారు. జిల్లా అడవుల్లో ఇంత వేట జరుగుతున్నా.. ఒక చిరుత పులి బలైనా సంబంధిత అధికారులు, సిబ్బందిపై అటవీశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పోస్టాఫీస్ బ్యాంకింగ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- హనుమకొండ డివిజన్ తపాలా సూపరింటెండెంట్ బానోత్ నందా


మాట్లాడుతున్న బానోత్ నందా

హన్మకొండ: పోస్టాఫీస్ సేవింగ్ బ్యాంకింగ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ డివిజన్ తపాలా సూపరింటెండెంట్ బానోత్ నందా అన్నారు. మంగళవారం హనుమకొండలోని తపాలా డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 6 ప్రధాన పోస్టాఫీస్‌లు, 49 సబ్ పోస్టాఫీస్‌లు, 337 బ్రాంచి పోస్టాఫీస్‌లో ఈ నెల 24 వరకు పోస్టాఫీస్ సేవింగ్ బ్యాంకింగ్ మేళా జరుగుతుందన్నారు. ప్రజల్లో సేవింగ్ ఖాతాలు, తపాలా స్కీమ్‌లపై అవగాహన కల్పిస్తారన్నారు. తపాలా స్కీంల్లో పొదుపు చేసిన ఖాతాదారులకు బ్యాంకులతో పోలిస్తే అధిక వడ్డీ చెల్లిస్తున్నట్లు చెప్పారు. పోస్టాఫీస్ సేవింగ్స్ ఖాతా ద్వారా 4 శాతం వడ్డీ రేటును అందిస్తుందన్నారు. ఖాతాలో పొదుపు చేసిన సొమ్ముకు ఆదాయం పన్ను మినహాయింపు కూడా ఉంటుందన్నారు. పోస్టాఫీస్ టైమ్ డిపాజిట్ ఖాతా ద్వారా 5 సంవత్సరాల వరకు పన్ను ప్రయోజనం పొందే అవకాశముందన్నారు. వీటితో పాటు పోస్టాఫీస్ నెలవారీ ఆదాయ పథకం ఖాతా, సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్, 15 సంవత్సరాల పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్ ఖాతా, నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్లు, కిసాన్ వికాస్ పత్ర, సుకన్య సమృద్ధి యోజన పథకం, హోల్ లైఫ్ అస్యూరెన్స్ ప్లాన్ సురక్ష, పీఎల్ఐ ఎండోమెంట్ అస్యూరెన్స్ ప్లాన్ సంతోష్, సువిధ, సుమంగల్, యుగల్ సురక్ష స్కీమ్‌లున్నాయన్నారు. ఖాతాదారులు నచ్చిన స్కీమ్‌లో పొదుపు చేసే అవకాశముంటుందన్నారు.

పథకం ప్రకారమే హత్యాయత్నం

- అపస్మారక స్థితిలో బాధితుడు ఉమేశ్
- భార్య, తల్లిదండ్రులు, మేనమామలపై కేసు నమోదు
- వివరాలు వెల్లడించిన సీఐ విశ్వేశ్వర్


నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ విశ్వేశ్వర్

దేవరుప్పుల: జనగామ జిల్లా దేవరుప్పుల మండలం చిన్నమడూరుకు చెందిన కూరాకుల ఉమేశ్‌పై అత్తింటివారు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేయగా ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు పాలకుర్తి సీఐ విశ్వేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆయన హత్యాయత్నానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. చిన్నమడూరుకు చెందిన ఉమేశ్‌తో లింగాలఘనపురం మండలం కళ్లెంకు చెందిన మానుపాటి స్రవంతితో గతేడాది మే నెలలో వివాహం జరిగింది. మూడు నెలలకే భార్యభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడి గొడవ కావడంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. ఈ విషయమై భర్త ఉమేశ్‌పై లింగాలఘనపురం పీఎస్‌లో కేసు నమోదు అయింది. ఓ వైపు పీఎస్‌లో కేసు నడుస్తుండగా మరోవైపు ఉమేశ్ ఇంటికి మాట్లాడేందుకని నమ్మబలికి సోమవారం (20న) ఉదయం 10 గంటలకు చిన్నమడూరుకు చేరుకున్న భార్య స్రవంతి, తల్లిదండ్రులు మానుపాటి రాములమ్మ, కుమార్‌తోపాటు లింగాలఘనపురం మండలం బండ్లగూడెంకు చెందిన మేనమామలు దేవరాయ ఏలేందర్, ఆంజనేయులు కలిసి వెంట తెచ్చుకున్న కత్తులతో ఉమేశ్‌పై దాడిచేసి తీవ్రంగా గాయపర్చడంతో రక్తపుమడుగును చూసి మృతి చెందాడని భావించిన సదరు ఐదుగురు పరారయ్యారు. అపస్మారక స్థితిలో ఉన్న ఉమేశ్‌ను కుటుంబ సభ్యులు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై బాధితుడి తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టగా సింగరాజుపల్లి బస్టాండు వద్ద కుమార్, ఏలేందర్, ఆంజనేయులును అరెస్టు చేసి విచారించగా నేరం ఒప్పుకున్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్సై రమేశ్‌నాయక్, హెడ్ కానిస్టేబుల్ సదానందం, యాకుబ్ తదితరులు ఉన్నారు.

అత్యాచార నిందితుడికి జైలు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అన్నారం పరిధిలో ఓ యువతిపై ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాకు చెందిన గండి చిన్నమ్మ నాయుడు అత్యాచారం కేసులో భూపాలపల్లి జిల్లా సెషన్ కోర్టు జడ్జి నారాయణబాబు ఏడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 30వేల జరిమానా విధించారు. వివరాలిలా ఉన్నాయి.. 2016లో కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిపై అత్యాచారం కేసు నమోదు కాగా ఆ కేసును అప్పటి కాటారం డీఎస్పీ కేఆర్‌కే ప్రసాదరావు దర్యాప్తు చేసి, చార్జ్‌షీట్ వేశారు. దీంతో మంగళవారం ట్రయల్‌లో ప్రభుత్వం తరఫున న్యాయవాది అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.శివరాజ్ బాధితుల పక్షాన వాదనలు వినిపించి నేరస్తునికి శిక్షపడేలా చేశారు. కోర్టు కానిస్టేబుల్ వరలక్ష్మీ, భిక్షపతిలను జిల్లా ఎస్పీ సురేందర్‌రెడ్డి అభినందించినట్లు కాళేశ్వరం ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

పురుగుల మందుతాగి రైతు ఆత్మహత్య

ములుగు రూరల్(గోవిందరావుపేట): పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గోవిందరావుపేట మండలం చల్వాయిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కన్నగంటి ప్రభాకర్‌చారి (53) తన సొంత భూమితో పాటు 5 ఎకరాలు కౌలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. సాగు చేసిన పంట ఆశించిన దిగుబడి రాకపోవడం, అప్పులు తీర్చ లేక కూతురి పెళ్లి ఎలా చేయాలనే మనోవేదనకు గురై ఈ నెల 19న ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి ప్రభాకర్‌చారిని ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య మణెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కర్ణాకర్‌రావు తెలిపారు.

కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

వరంగల్ క్రైం: తెలంగాణ కాంగ్రెస్ చీఫ్ రేవంత్‌రెడ్డి పాదయాత్రలో బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. ఈనెల 20న రేవంత్‌రెడ్డి పాదయాత్రలో కానిస్టేబుల్ సాదిక్ పాషా రోప్ బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్నాడు. కమలాపూర్ మండలం మరిపెల్లిగూడెంకు చెందిన ఉప్పుల శివప్రసాద్ రోప్ పార్టీని దాటుకొని రేవంత్‌రెడ్డిని కలిసేందుకు వెళ్లే క్రమంలో సాదిక్ పాషా అడ్డుకున్నాడు. దీంతో కక్ష కట్టిన నిందితుడు ఉద్దేశ పూర్వకంగా ఏషియన్ మాల్ ప్రాంతంలో దాడి చేసి తీవ్రంగా గాయపర్చినట్లు ఆయన తెలిపారు. పోలీసు అధికారుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు.

గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్ట్

- రూ.34 లక్షల విలువైన గంజాయి స్వాధీనం
- ఉప సర్పంచ్‌తో సహా నలుగురు అరెస్ట్


అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కరుణాకర్

వరంగల్ క్రైం: వరంగల్ కమిషనరేట్ పరిధిలో గంజాయ స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ముఠా టాస్క్‌ఫోర్స్, ఆత్మకూరు పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసినట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ పుల్ల కరుణాకర్ తెలిపారు. ఉపసర్పంచ్‌తో పాటు నలుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసి వారి నుంచి రూ.34 లక్షల విలువగల 170 కిలోల గంజాయి, కారు, బొలెరో వాహనం, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం గొరుకొత్తపల్లికి చెందిన రాయినేని శంకర్, వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామానికి చెందిన ముసిక లక్ష్మణ్, ములుగు జిల్లా బండారుపల్లి గ్రామానికి చెందిన మాత్ర మహేష్, పస్రాకు చెందిన గండికోట సతీష్‌లను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. నిందితులు రాయినేని శంకర్, ఆత్మకూరు మండలం నీరుకుళ్ల ఉపసర్పంచ్ ముసిక లక్ష్మణ్ సులభంగా డబ్బు సంపాదించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్మాలని ప్రణాళిక రూపొందించుకున్నారు. ఏపీలోని నర్సీపట్నంకు చెందిన పరారీలో ఉన్న నిందితుడు నూకరాజు ద్వారా 170 కిలోల గంజాయిని కొనుగోలు చేసి రెండు కిలోల చొప్పున ప్యాకెట్లు చేసి బొలెరో వాహనంలో ఎవరికి అనుమానం రాకుండా కొబ్బరి బొండాల మధ్యలో రహస్యంగా భద్రపర్చి వరంగల్‌కు తరలిస్తున్నారు. గంజాయిని వరంగల్‌కు తరలిస్తున్న క్రమంలో నిందితులు రాయినేని శంకర్, ముసిక లక్ష్మణ్‌లు కారులో ఎస్కార్ట్‌గా గంజాయి తరలిస్తున్న వాహనానికి వెళ్లారు. మంగళవారం ఆత్మకూరు గ్రామ శివారు ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో అనుమానాస్పదంగా వస్తున్న నిందితుల వాహనాలను తనిఖీ చేయగా బొలెరో వాహనంలో కొబ్బరి బొండాల మధ్య గంజాయి ప్యాకెట్లు దొరికినట్లు డీసీపీ కరుణాకర్ వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన పరకాల ఏసీపీ శివరామయ్య, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, ఆత్మకూరు ఇన్‌స్పెక్టర్ బి.కుమార్, టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు వడ్డెబోయిన లవణ్‌కుమార్, నిసార్‌పాషా, హెడ్ కానిస్టేబుల్ స్వర్ణలత, కానిస్టేబుళ్లు శ్యామ్, రాజు, భిక్షపతి, సురేష్, శ్రవణ్, నవీన్, కరుణాకర్‌లను ఈస్ట్ జోన్ డీసీపీ కరుణాకర్ అభినందించారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి


లక్ష్మీనారాయణ (ఫైల్)

ఖిలా వరంగల్: కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందడంతో ఆ కుటుంబం ఆనందంలో మునిగిపోయింది. మరికొద్ది రోజుల్లో హెడ్ కానిస్టేబుల్ శిక్షణ పూర్తి అవుతుందని, తమ కలలు నెరవేరే రోజు దగ్గరలోనే ఉందని సంతోష పడ్డారు. కానీ గుండెపోటుతో కానరాని లోకాలకు వెళ్లారు. వివరాలిలా ఉన్నాయి.. హైదరాబాద్ నాంపెల్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వి.లక్ష్మీనారాయణ (54)కు హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందాడు. 42 రోజుల పాటు హెడ్‌కానిస్టేబుల్ శిక్షణ కోసం వరంగల్ మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలకు ఈనెల 6న శిక్షణలో చేరాడు. మహాశివరాత్రి సందర్భంగా శని, ఆదివారం రెండురోజులు సెలవులు రావడంతో హైదరాబాద్‌లోని తన ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం 9 గంటలలోపే తిరిగి ట్రైనింగ్‌లో చేరాడు. అదేరోజు రాత్రి 8 గంటలకు వాంతులు విరోచనాలు కావడంతో గమనించిన పోలీస్ అధికారులు ఎంజీఎంకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హన్మకొండ, హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. లక్ష్మీనారాయణకు భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. లక్ష్మీనారాయణ మృతి చెందడంతో పీటీసీ ప్రిన్సిపల్ ఇంజారపు పూజ, పోలీస్ అధికారులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేసి, నివాళులర్పించారు. డీఎస్పీలు శ్రీనివాస్, రమేష్, ఆర్ఐలు చంద్రశేఖర్, నవీన్, కాశీరాం, మహేష్, శ్రీకాంత్, సీఎల్ఐ నరేష్‌కుమార్, రవీందర్, రాజ్యలక్ష్మీ, ఏఎల్ఐ రాధిక, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్, పీఆర్ఓ రామాచారి ఉన్నారు.

కంచె వద్దు.. ప్రత్యామ్నాయం ముద్దు

- విద్యుత్ కంచెలతో ప్రాణాలు పోగొట్టుకుంటున్న రైతులు
- వీటి ఏర్పాటుకు అనుమతులు లేవంటున్న అధికారులు
- ఇతర రక్షణ చర్యలతో పంటలను కాపాడుకోవాలని సూచన
- నాలుగు రోజుల వ్యవధిలో ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మృత్యువాత


కిరణ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- ఈ నెల 18న జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం బసిరెడ్డిపల్లికి చెందిన బండకింది నర్సింహులు (42) వరి పొలంలో నీరు చూడడానికి వెళ్లాడు. పక్క భూమి గల బండారు రాజయ్య అనే రైతు పంట రక్షణకు అడవిపందుల నివారణకు పొలం చుట్టూ ఉన్న ఇనుప ముళ్లకంచెకు కరెంటు షాక్ పెట్టాడు. అది గమనించని నర్సింహులు ఇనుప కంచె తగిలి కరెంటు షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు.
- తాజాగా మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి గ్రామ పంచాయతీ దుమ్లా తండాకు చెందిన అంగోతు సీవీ నాయక్ తమ మొక్కజొన్న పంటను కోతుల నుంచి రక్షించుకోవడానికి విద్యుత్ వైర్లతో అక్రమంగా కంచె ఏర్పాటు చేశాడు. మంగళవారం వేకువజామున సీవీ నాయక్ కుమారుడు కిరణ్‌తో కలిసి కాపలా వెళ్లారు. కిరణ్ ఆదమరిచి విద్యుత్ ప్రవాహమున్న వైర్లపై పడిపోవడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుమారుడిని రక్షించేందుకు వెళ్లిన తండ్రి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు.

హన్మకొండ: జంతువులు ఇతర వన్యప్రాణుల నుంచి పంటలను కాపాడుకునేందుకు అక్రమంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ కంచెలతో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయొద్దని విద్యుత్ అధికారులు, టీఎస్ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా.. అవేమి పట్టనట్లు కొందరు వ్యవహరిస్తున్న తీరుతో ప్రాణనష్టం కలుగుతుంది. వన్యప్రాణుల నుంచి పంటలను కాపాడేందుకు ముళ్ల కంచెలతో పాటు, ఇతర మొక్కలు నాటే పద్ధతులు అనాదిగా వస్తున్నాయి. వీటిని కాదని అధిక వోల్టేజీతో విద్యుత్ ప్రసరణ జరిగే లోహపు తీగలతో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ కంచెలు ప్రాణాంతకంగా మారుతున్నాయి. పంటల రక్షణకు ఏర్పాటు చేస్తున్న లోహపు తీగను పశువులు, జంతువులు, వన్యప్రాణులు, వ్యక్తులు తాకినప్పుడు విద్యుదాఘాతానికి గురవుతూ ప్రాణనష్టం జరుగుతుంది. కొంతమంది వన్యప్రాణులను వేటాడేందుకు సైతం విద్యుత్ తీగలతో ఉచ్చులు ఏర్పాటు చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రమాదమని తెలిసినా..

రైతులు పంటలు కాపాడుకునేందుకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం ప్రమాదమని తెలిసినా కంచెలు ఏర్పాటు చేస్తూనే ఉన్నారు. విద్యుత్ కంచె ఏర్పాటు చేసుకున్న సమాచారం తెలియని పక్క రైతులు, పశువులు అటు వైపు వెళ్లడంతో విద్యుత్ షాక్‌కు గురవుతూ విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తున్న వారిపై అధికారులు కేసులు నమోదు చేయిస్తున్నారు.

ప్రత్యామ్నాయాల ఏర్పాటు..

పశువులు, కోతులు, ఇతర వన్యప్రాణుల నుంచి పంటలు కాపాడుకునేందుకు ప్రత్యామ్నాయ పద్ధతులవైపు ఆలోచించాలని ఎన్పీడీసీఎల్ అధికారులు చెబుతున్నారు. రికార్డింగ్ మైక్‌లు, ఇతర శబ్దాలు వచ్చే పరికరాల ఏర్పాటుతో కూడా అడవి జంతువుల బెడద తగ్గించుకోవచ్చని తెలిపారు.